# యా మా సా మాయా

'జమదగ్ని'

అనగనగా ఒక చీమ.

ఆ చీమ కో తలకాయ ఉంది.

ఆ తలకాయలో 'నే' నుంది.

ఈ 'నేను' ఇంతపని చేస్తా ననుకోలేదు.

కాని చేసేసింది.

తీరా చూస్తే ఇంత చేసిందీ తానే.

ఆ సంగతి తెలిసేటప్పటికే ఇంతయింది.

ఇంతవుతుందని తెలిస్తే చెయ్యకనే పోను.

అలా తెలిస్తే ఇంకేం?

సంసారంపోయి సారమే దక్కేది.

చీమ పాపం నడుస్తోంది.

దారిలో బెల్లం కనిపించింది.

అదేమిటో దానికి తెలియదు.

దగ్గరకుపోయి చూచింది. ఊరికే చూడడంకాదు.

రుచి చూచింది.

మహా రుచిగా ఉంది.

రుచిగా ఉంది కదా అని తిన్నంత తిని ఒక్కొక్క అణువే చేరవెయ్యడం మొదలు పెట్టింది.

అంతా చేరవేసుకున్నాక సావకాశంగా తిందా మనుకుంటూ ఎన్నిసార్లు తిరిగిందో లెక్కలేదు.

ఇది తిరుగుతూనే ఉంది.

అది తరుగుతూనే ఉంది.

కాని ఎంతసేపటకీ అయిపోవడంలేదు.

పైగా గడ్డగడ్డగానే ఉన్నట్లు కనిపిస్తోంది.

చీమ మధ్యలో ఒకసారి ఆగి అటూ ఇటూ చూచింది.

గడ్డవైపు చూస్తే పట్టరాని కోపం వచ్చింది.

మొదట్లో ఎంత ఉందో ఇప్పుడూ అంతే ఉన్నట్టుంది.

ఇంతసేపు తిరిగినా తరగలేదే! ఏం చెయ్యాలి దీన్ని?

బొరియవైపు చూస్తే తన కళ్ళను తానే నమ్మలేక పోయింది.

నలుసుమీద నలుసుగా నలుసుమీద నలుసుగా అంతా బెల్లం నలుసులతో నిండిపోయి ఉంది.

చాలా ఉందే ఇది!

ఇంత చేరవేసిందీ తానే గదా!

ఈ నడకతో ఈ ఒంటితో ఇంతపనిచేస్తే తనకే గనక ఎగిరేశక్తి ఉన్నట్లయితే ఈ గడ్డంతా ఈపాటికి బొరియలో ఉండిపోయేది గాదూ!

ఆ ఊహ వచ్చిందో లేదో దాని ఆయుష్కాలం అయిపోయింది.

వెంటనే దోమయి కూచుంది.

అటూ ఇటూ ఆడుతున్న రెక్కల్ని చూచుకుని ఎగిరిపడింది దోమ.

ఎగురుతూ ఉంటే మరో అద్భుతం తోచింది.

ఓహో! అదీ సంగతి!

ఈ రెక్కలలో సంగీతంగూడా వస్తుంది కాబోలు.

రెక్కలూ, సంగీతం! ఇంక లోటేమిటి? అనుకుంటూ తిరగసాగింది దోమ.

చీమగా ఉన్నప్పుడు చేరవేసుకోవడానికి రెక్కలుంటే బాగుండే దనిపించింది. ఇప్పుడు తీరా అవి వచ్చాక చేరవెయ్యడమే అవసర మనిపించడంలేదు దోమకు.

పైగా ఒంటిని బట్టి రుచీ మారింది.

ఇప్పుడు దాని రుచి అంతా బెల్లంలో కాదు నల్లలో ఉంది. అదైనా నిలవుంటే బాగుండదు.

తయారయే చోటి నుంచే నరానరి ఆస్వాదిస్తే దాని మజా ఇంతా అంతా కాదు.

అందులోనూ పశువుల నెత్తురుకంటే మనుష్యుల నెత్తురు రుచికి రుచీ, సులువుకు సులువూ! దానికీ దీనికీ సాపత్యమే లేదు.

పల్చన గావడంచేత కాబోలు మనిషి చర్మంలో దాని ముల్లు ఇట్టే గుచ్చుకుపోతుంది. వెచ్చవెచ్చగా చెరుకుపానకంలా ఎంతైనా పుచ్చుకోవచ్చు.

కాని ఒక్కటే చిక్కు.

పశువుల్లోకంటె మనుష్యుల్లో ప్రమాదం ఎక్కువ.

చిన్నపిల్లలు ఊరికే అటూ ఇటూ దొర్లుతారు గాని పెద్దవాళ్లు మాత్రం అలా ఊరుకోరు. సరిగ్గా తాను వాలినచోటే తమకే దెబ్బ తగుల్తుం దనైనా లేకుండా గట్టిగా చరుచుకుంటారు.

అమ్మో! ఆ గురి చెప్పతరం కాదు! ఇప్పటికే ఒకటి రెండుసార్లు చచ్చేటంత పనయింది.

తన ఒళ్లేగనక పెద్ద ఒళ్లయితే వీళ్లేం చెయ్యగలరు?

అలా అనుకుంటూనే దోమ దెబ్బతిని చచ్చి సామజమై అవతరించింది.

దోమెక్కడ! సామజ మెక్కడ!

ఎంత ఒళ్లు వచ్చింది తనకి!

ఇప్పుడు మనిషి చెయ్యి కాదుగదా, కొండ వచ్చి మీదపడ్డా తనకేం పరవాలేదు.

అంతేకాదు, మరో సౌలభ్యం వచ్చింది.

అప్పటి ముల్లు కంటే ఇప్పటి తొండం ఎంతో బాగుంది. దీంతో నెత్తురేం కర్మం, మనుషుల్ని మనుష్యుల్నే పీల్చెయ్యవచ్చు!

ఏనుగయిన వెంటనే పూర్వస్మృతితో అలా అనుకుందిగాని పాపం ఒంటి మార్పుతో రుచి మార్పు వచ్చిందన్న సంగతి ఇంకా తెలియలేదు దానికి.

పైగా ఇప్పుడది ఉన్నచోట నరవాసనే లేదు. అంతా మహారణ్యం!

అమాంతం ఒక ఎత్తైన చోటికిపోయి చుట్టు పక్కలంతా పరకాయించి చూచింది ఏనుగు.

తన ఒళ్లుగూడా ఒకసారి చూచుకుంది.

దానికి పరమానంద మయింది!

నిజానికి దాని ముందు నిలవ గలిగే ప్రాణి ఏముంది? అన్నీ అల్పప్రాణులే!

కోరి ఇంత శరీరం తెచ్చుకున్న తాను సాధించలేం దేముంది ఈ జగత్తులో?

సంతోషాతిశయంతో పాడాలనుకుని గొంతెత్తింది ఏనుగు. ఒళ్లు తెలియని మైకంతో పాడేసింది.

ఆ మంద్ర గంభీర నిర్ఘోషం విని అల్పప్రాణులన్నీ హడలిపోయాయి. మృగరాజుకూడా వెనకెక్కడో నిలబడి విన్నదే కాని ముందుకు రాలేకపోయింది.

ఈ విజయానికి ఏనుగుకు ఎక్కడలేని అహంకారమూ వచ్చింది.

కాని ఎందుకో తృప్తి కలగ లేదు.

క్రమక్రమంగా తానుపాడిందానికంటే ఎవరైనా పాడితేనే బాగుంటుందనిపించింది.

దాంతో ఎటునుంచైనా సుతిమెత్తని సంగీతం వినిపిస్తే అందులో లీనమై ఒళ్లు మరిచిపోయేది.

అటువంటి సమయాల్లోనే కాస్త తృప్తి కలిగేది.

తక్కినప్పు డెందుకో పట్టి చిరాకు!

ఆ చిరాకుతో నాలుగాకులు తినడానికి చెట్టంతా పడగొట్టేది.

నెత్తురెలాగూ లేదు, ఆకులేనాయ్ తినవలసింది. చిగురాకులు తింటే సరిపోదూ, చెట్టునలా ఉంచి!

ఊఁహు—చాలేది కాదు దాని తత్వానికి.

పైగా అడిగేవాడు లేడు. దానికి తోడు ఒకరు తన్నేం చెయ్యగలరని పట్ట పగ్గాలు లేని పొగరుమోతుతనం.

దాంతో అరణ్యాన్నంతటినీ చితకులు చితకులుగా విరిచి పోగులు పెట్టసాగింది ఏనుగు.

ఒకరోజున దాని కాహుతయిన పెద్దచెట్టుకు ఒక ఎండుకొమ్మ ఉన్నది.

ఆ కొమ్మ విరగడంతో దాంట్లోనుండి ఒక కందిరీగ ఝూమ్మంటూ బైటికి వచ్చింది.

లేచింది మొదలు ఝూంకారంచేస్తూ అది ఎగురుతూ ఉంటే దాని వ్యాహావస్వభావాలు ఏనుగుకు తెలియలేదు కాని సంగీత సమాధి లభించింది.

తొండం పైకెత్తుకుని ఒళ్ళంతా ఊగిసలాడించుకుంటూ పరవశమైపోయింది.

ఆ పారవశ్యంతోనే కంధిరీగ ఎటుపోతే అటే పోయింది ఏనుగు.

దాన్ని చూస్తూ కాదు నాదం మాత్రమే వింటూ.

కంధిరీగకు ఈ ధ్యాసే లేదు. తన పాటేమో తావేమో!

విడదియ్యరాని గమన గానాలతో అది వీర విహారం చేస్తోంది.

అంతలో ఏమయిందో ఏమిటో ఏనుగుకు బైటి సంగీతం లోపల వినిపించ సాగింది.

వట్టి సంగీతమైతే బాగానే ఉండేది.

కాని అది కాదాయె! ఇదేదో లోపల తొలి చేస్తోంది!

ఏనుగు నిలవలేక పోయింది.

ఆ బాధ తప్పించుకోవాలని పరుగెత్తింది.

పరుగెత్తితే పోయేదా అది, లోపల ప్రవేశించిన బాధాయె!

ఉద్రేకపడి పరుగెత్తిన కొద్దీ మరీ మరీ అతిశయించిం దా బాధ.

ఏం చెయ్యడానికీ తోచలేదు ఏనుగుకు.

తొండం తెంపేసుకుందా మని ప్రయత్నించినా తెగలేదు.

చేసేదిలేక కుప్పకూలిపోయి ప్రాణ నిర్యాణ సమయంకోసం ఎదురు చూచింది.

అంత ఒళ్ళూ దాని కప్పుడెందుకూ పనికిరాలేదు పాపం!

స్వాస్థ్యం లేకపోవడంతో అదికావాలి ఇది కావాలి అన్న కోరికలు నశించాయి, ఇప్పుడు వేధిస్తున్న ఈ బాధ వదిలితేచాలునన్న వాంఛ తప్ప.

మరి ఈ బాధ ఎందుకు వచ్చింది?

ప్రాణం పోతోందొక ప్రక్క. మరో ప్రక్క లోపల నుండి అస్పష్టంగా వినిపిస్తోంది సంగీతం.

ఏమిటో అర్థమున్నట్టుందే!

శివ శివా! ప్రాణం తీసేస్తోంది పాడు సంగీతం!

యూ మా సా మాయూ!
యూ మా సా మాయూ!
యూ మా సా మాయూ!

